## శ్రీలక్ష్మి చదువుకు చేయూతనిస్తా!



పరిగి, జనవరి 15: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన శ్రీలక్ష్మి చదువు కోసం రూ.50వేలు అందజేస్తానని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగి మండలం లక్నాపూర్ గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాస్ కూతురు శ్రీలక్ష్మీ సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదువుకొని ఎంబీబీఎస్ సీటు సాధించారు. దీంతో పరిగిలో ఆమెను సన్మానించడంతోపాటు ఆమె చదువు కోసం అన్ని విధాలుగా సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవిందరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు..



కొడంగల్, జనవరి 15: లగచెర్ల కేసు విచారణలో భాగంగా బొంరాస్‌పేట మండలంలోని పోలీస్‌స్టేషన్‌కు బుధవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలతో పాటు అభిమానులు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## సెల్‌ఫోన్ లైట్లతోనే సంత



వికారాబాద్, జనవరి 16: వికారాబాద్ కూరగాయల మార్కెట్‌లో అమ్ముకునేందుకు వికారాబాద్ మండల ప్రజలే కాకుండా ఆయా మండలాలు, గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే రైతుబజార్ వద్ద సరైన విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో సెల్‌ఫోన్ లైట్ల మధ్య కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి . సాయంత్రం వికారాబాద్ మార్కెట్‌లో సంత జరుగుతుండటంతో ప్రజలు కూరగాయలను కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ స్థలం సరిపోక పోవడంతో మధ్యలో నిలిచిన పోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలంలో కూడా రైతులు కూరగాయలు అమ్ముకుంటున్నారు. ఆ ప్రదేశంలో సరైన విధంగా విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడుగా తాగు నీటి సౌకర్యం కల్పించడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతలో విద్యుత్ దీపాలు, నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

## క్రీడలతో స్నేహభావం..



కులకచర్ల, జనవరి 15 : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని అడ్వకేట్ నర్సింహులు యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణాయాదవ్, అంజిలయ్యయాదవ్, నర్సింహులుయాదవ్, మల్లేశ్‌యాదవ్, నందు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత..



ధారూరు, జనవరి 15: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కోస్నం వేణుగోపాల్ రెడ్డి నాయకులు వెంకట్ రామ్ రెడ్డి, శ్రీనివాస్, యాదయ్య,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



కులకచర్ల, జనవరి 15 : చౌడాపూర్ మండల పరిధిలోని పుర్సంపల్లి గ్రామ పంచాయతీలో రూ.34వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారుడు నవనీతరెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణారెడ్డి, ఎర్రం శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్, దామోదర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు

బంట్వారం, జనవరి 15: పేకాట ఆడు తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసిన ఘటన బంట్వారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళ వారం రాత్రి జరిగింది. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ కథనం ప్రకారం.. మండల పరిధి లోని బొపునారం గ్రామంలో పేకాట ఆడు తున్నారని సమాచారం అందడంతో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ 5000లు, కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.



తాండూరు: సారమ్మ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



వికారాబాద్: ముగ్గుకు రంగులు వేస్తున్న మహిళలు

రంగు రంగుల హరివిల్లులు... గంగిరెద్దుల విన్యాసాలు... ముత్యాల ముగ్గుల నడుమ అందంగా తీర్చిదిద్దిన గొబ్బెమ్మలు... గగనంలో ఎగసిన గాలిపటాలతో యువతీ, యువకుల కేరింతలు, చిన్నారుల సందడి... పల్లెసీమల ప్రతిబింబాన్ని చాటే విధంగా మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను ప్రజలు వికారాబాద్‌జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. తాండూరు పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో వైభవంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ కన్నుల పండువగా నిర్వహించారు. శివాజీ చౌక్‌లోని సారమ్మ మాతా ఆలయంలో వైభవంగా కుంకుమార్చన చేశారు. దోమ మండల పరిధిలోని లింగనపల్లి గ్రామానికి చెందిన యువకుడు కొండని రాజు తన తల్లి కొండని లక్ష్మమ్మ జ్ఞాప కార్థం ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

–న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



తాండూరు: మకరజ్యోతి వెలిగిస్తున్న పూజారులు, స్వాములు



దోమ: లింగనపల్లిలో బహుమతులను అందజేస్తున్న రాజు

# ప్రచారం దండి.. ఖజానాకు గండి..!

### యాడ్ ఏజెన్సీలపై నియంత్రణ కోల్పోయిన జీహెచ్‌ఎంసీ

**జీహెచ్‌ఎంసీ ప్రకటన విభాగంలో అధికారుల ఇష్టారాజ్యం**

**రికార్డుల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా..**

**కేబీఆర్ పార్కు చుట్టూ అనధికారిక లాలీపాప్స్..**

**లెక్కకు మించి ట్రాఫిక్ అంబ్రెల్లాలు**

**క్షేత్రస్థాయి తనిఖీలు పట్టని అధికారులు**

సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీకి ఆదాయ వనరుల్లో అడ్వర్టయిజ్‌మెంట్ ( ప్రకటన విభాగం) ప్రత్యేకం. ఏటా రూ. 80 కోట్ల పై రావాల్సిన చోట..కేవలం రూ. 20కోట్లు దాటడం లేదు. ఏజెన్సీల కొమ్ము కాస్తు కొందరు అధికారులు బల్దియా ఖజానాను గండి కొడుతున్నారు. ముఖ్యంగా కేబీఆర్ పార్కు కేంద్రంగా ప్రకటన దందా జరుగుతున్నదని ఫిర్యాదులు వస్తున్న ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదు. కేబీఆర్ పార్కు చుట్టూ , ప్రధాన రహదారి సెంట్రల్ మీడియన్‌లో అత్యధికంగా లాల్‌పాప్స్ (ప్రకటనల బోర్డులు) దర్శనమిస్తాయి. రికార్డుల కంటే అత్యధికంగా అనధికారికంగా ఉంటాయన్నది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా కొంత మేరలో కోర్టు స్టే ఆర్డర్ పేరుతో న్యాయస్థానంలో గెలిచి సదరు జీహెచ్ఎంసీ ఆదాయాన్ని మెరుగుపర్చే చోట ప్రకటనల విభాగంలోని కొందరు అధికారులు నెలకు రూ. 5 లక్షల మేర ముడుపులు సదరు ఏజెన్సీ నుంచి అందుతున్నాయన్న బలంగా వినిపిస్తున్న విమర్శ. దీనికి తోడు నగరంలో ఎక్కడైనా 15 మీటర్ల కంటే హైట్ ఉన్న హోర్డింగ్‌లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. 15 మీటర్ల వరకు ఉన్న హోర్డింగ్‌లు సైతం పక్కాగా నిబంధనల ప్రకారం నడపాలి. సదరు ఏజెన్సీలు మెట్రో ఫిల్లర్ల లక్ష్యంగా అక్రమార్జనకు పాల్పడుతున్నారని తెలుస్తున్నది. నగరంలో 1500 చోట్ల ట్రాఫిక్ అంబ్రెల్లా ఉంటే 3వేల వరకు ఉన్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

#### గ్రేటర్‌లో ఎన్ని అనుమతులున్నాయో..

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని హోర్డింగులకు అనుమతులున్నాయో, వాటికి ఎంత గడువుందో తెలియదు. అక్రమంగా ఏర్పాటైన హోర్డింగులెన్నో..వాటి ద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాకు జరుగుతున్న నష్టానికి లెక్కేలేదు, యూనిపోల్స్, లాలీపాప్స్, హోర్డింగు ఇలా అనేక ఉన్న ప్రాంతాలు అధికారుల రికార్డులు లెక్కలకు , క్షేత్రస్థాయిలో ఉన్న వాటికి ఎక్కడ పొంతన ఉండడం లేదన్నది ఇటీవల వస్తున్న బలమైన ఆరోపణలు .ఈ క్రమంలోనే ప్రకటన విభాగంలో భారీగా అవినీతి జరుగుతుందని , జీహెచ్‌ఎంసీకి రావాల్సిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ కోట్లాది రూపాయలను కొందరు అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, అక్రమ హోర్డింగ్స్‌లు, మాల్స్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసిన వారు 'కార్తీక్' ట్యాక్స్ చెల్లిస్తున్నారని గతంలో జరిగిన కౌన్సిల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ దృష్టికి కార్పొరేటర్లు తీసుకువచ్చారు.ప్రకటనల రూపంలో వందల కోట్లు రావాల్సిన చోట కేవలం రూ. 20కోట్లు మాత్రమే వస్తుండడంపై కార్పొరేటర్లు తీవ్రంగా తప్పుపట్టారు.

#### కనిపించని క్షేత్రస్థాయి తనిఖీలు

గ్రేటర్‌లో ఎన్ని కేటగిరీల నుంచి జీహెచ్‌ఎంసీకి ఆదాయం వస్తుందనే స్పష్టత లేదు. సెంట్రల్ డివైడర్లు, యూనిపోల్స్, హోర్డింగ్స్, నియోగ్లోసైన్ బోర్డులు, బస్ షెల్టర్లు, వాల్ పేయింటింగ్, ఫ్లెక్సీ బోర్డు, గ్లాస్ పోస్టర్, ఫిల్లర్ బోర్డులు, పెయింటింగ్, స్టిక్కర్, ఫ్లాగ్స్, షాప్‌షూట్ బెలూన్లు, అంబ్రెల్లాస్, స్లైడ్, షార్ట్ ఫిల్మ్, ఆటోలు, బస్సులు, క్యాబ్స్, వ్యాన్స్‌లకు సంబంధించిన ప్రకటనలపై ఫీజు వసూలు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. పెట్రోల్ బంకుల్లో భారీ స్థాయిలో గ్లోసైన్ బోర్డులు ఏర్పాటు చేసుకుని ప్రకటనలు ఇస్తున్నారు. వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సినిమా హాళ్లు, మల్టీప్లెక్స్‌లను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.




గ్రేటర్‌లో అనధికారికంగా ఉన్న ట్రాఫిక్ అంబ్రెల్లా



కొడంగల్, జనవరి 15: స్థానిక శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు నెలరోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీగోదాదేవి అమ్మవారికి అలంకార తిరుమంజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఆలయ అర్చకులు మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో కొలువుదీర్చి శ్రీ గోదాదేవి అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఇందిరానగర్‌లో భారీ చోరీ

బంజారాహిల్స్, జనవరి 15: సంక్రాతి పండుగ వేళ బంజారాహిల్స్‌లో భారీచోరీ జరిగింది. ఇంటి తాళాలు పగలగొట్టిన దొంగలు 20తులాల బంగారంతో పాటు రూ.25లక్షల నగదును దోచుకువెళ్లారు. బంజారాహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.2 లోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న ఎన్.లోవాలక్ష్మి టీచర్. సంక్రాంతి పండుగ కోసం ఈనెల 12న భర్త వెంకటరమణ, కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి రాజమండ్రిలోని సొంతూరికి వెళ్లారు. మంగళవారం ఉదయం పైపోర్షన్‌లో అద్దెకు ఉంటే కరుణాకర్ కిందికి దిగగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి కనిపించాయి. వెంటనే లోవాలక్ష్మికి సమాచారం అందించారు. మంగళవారం రాత్రి వచ్చి చూడగా అల్మారలో ఉండాల్సిన 20తులాల బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.25లక్షల నగదు కనిపించలేదు. లోవాలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రెండోదశలో..160 కిలోమీటర్లు

**మెట్రో విస్తరణలో పార్ట్-బీ కీలకం**

**మార్చి నెలాఖరు వరకు డీపీఆర్ సిద్ధం చేయనున్న మెట్రో సంస్థ**



సిటీబ్యూరో, జనవరి 15(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో విస్తరణలో సెకండ్ ఫేజ్‌లోని పార్ట్-బీ అత్యంత కీలకంగా మారింది. ఇన్నాళ్లు మొత్తంగా 69కిలోమీటర్ల మేర మెట్రో రైలు మాత్రమే అందుబాటులో ఉండగా, రెండో దశ విస్తరణతో నగరంలో కొత్తగా 160 కిలోమీటర్లు అందుబాటులోకి రానున్నది. ఫేజ్-2ను రెండు భాగాలుగా పనులు చేపట్టేందుకు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లను తయారు చేసిన హెచ్‌ఏఎంఎల్ సంస్థ... తాజాగా పార్ట్-బీలో నార్త్ సిటీకి మెట్రోను విస్తరిస్తూ డీపీఆర్ సిద్ధం చేస్తున్నది. దీంతో ఫేజ్-1, ఫేజ్-2 కలిపి నగరంలో ప్రాజెక్టులతో మొత్తంగా 232 కిలోమీటర్ల పొడవైన మెట్రో నిర్మితం కానున్నది. నగరానికి మెట్రో పరిధిని పెంచడంలో ఫేజ్-2 ముఖ్యమైనదైతే, 90కిలోమీటర్ల మేర అతి పొడవైన పార్ట్-బీ ప్రాజెక్టు నగర మెట్రో విస్తరణలో ముఖ్యమైనదనీ నిపుణులు చెబుతున్నారు.

#### ఫోర్త్ సిటీకి డీపీఆరే ముఖ్యం..

కోర్ సిటీతో అనుసంధానం చేస్తూ గేట్ వే ఆఫ్ తెలంగాణగా పిలిచే నార్త్ హైదరాబాద్, ఫోర్త్ సిటీ ప్రాంతానికి మెట్రో పరుగులు పెట్టాలంటే డీపీఆర్ ముఖ్యమైనది. మూడు నెలల్లో ప్రాజెక్టు నివేదిక రూపొందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనున్నది. ఈ క్రమంలో నగరంలో శివారు ప్రాంతాలకు మెట్రో నిర్మించేందుకు ఫేజ్-2 మెట్రో విస్తరణలో భాగంగా పార్ట్-బీలో జేబీఎస్ నుంచి శామీర్‌పేట్(22కి.మీ), ప్యారడైజ్ నుంచి మేడ్చల్(23కి.మీ) వరకు, ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ వరకు (45కి.మీ) మేర మొత్తంగా 90 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం నిర్మితం కానున్నది. తొలుత నార్త్ సిటీ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోకుండా, కేవలం ఫోర్త్ సిటీ-శంషాబాద్ ప్రాజెక్టును మాత్రమే ఫేజ్-2లో చేర్చిన ప్రభుత్వం డీపీఆర్ లేకుండా పార్ట్-ఏను మాత్రమే కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ తర్వాత పార్ట్-బీలో ఫోర్త్ సిటీతోపాటు నార్త్ సిటీని కూడా చేర్చడంతో... నగరంలో మొత్తంగా రెండో దశ మెట్రో విస్తరణ 162 కిలోమీటర్లు అందుబాటులోకి రానున్నది. ఇప్పటికే ఫేజ్-2 పార్ట్-ఏలో 76 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ సిద్ధం కాగా, పార్ట్-బీలో భాగంగా ఫోర్త్ సిటీ, ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట ప్రాంతాలు రానున్నాయి.

#### పార్ట్-బీతో 90 కిలోమీటర్లు..

ప్రస్తుతం ఫేజ్-1 ద్వారా మెట్రో కేవలం కోర్ సిటీ ప్రాంతాలకు మాత్రమే రాకపోకలు సాగించే వీలు కలిగింది. కానీ ఫేజ్-2 లోని పార్ట్-బీ అందుబాటులోకి వస్తే 90 కిలోమీటర్ల పొడవైన మెట్రోతో శివారు ప్రాంతాల వరకు ప్రయాణించే వీలు కలుగనున్నది. రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ఫోర్త్ సిటీకి అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, కోర్ సిటీని అనుసంధానం చేసే మార్గం కూడా అందుబాటులోకి రానున్నది. పార్ట్-బీ ద్వారానే ఏకంగా 90 కిలోమీటర్ల మెట్రో నిర్మితం కానున్నది. ఫేజ్-2 పార్ట్-బీగా డీపీఆర్‌ను మూడు నెలల్లో సిద్ధం అవుతుంది. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా మెట్రో విస్తరణతో రవాణా సదుపాయాలు అందుబాటులోకి రానున్నదని హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్‌వీఎస్.రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అయితే మియాపూర్ వరకు మెట్రో సౌకర్యం ఉన్నది. ఇక్కడి నుంచి పటాన్‌చెరు వెళ్లేందుకు రోడ్డు రవాణా సదుపాయం కూడా ఉన్నది. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో విస్తరించినా పెద్దగా వచ్చే ప్రయోజనం ఉండదు. అదేవిధంగా ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరించినా ఆశించిన స్థాయి ప్రయోజనాలు ఉండవు. కానీ కోర్ సిటీ నుంచి శివారులో ఉండే మేడ్చల్, శామీర్‌పేట్, శంషాబాద్, ఫోర్త్ సిటీ వంటి ప్రాంతాల అనుసంధానంతో నగరంలో పొడవైన రవాణా సౌకర్యం నగర వాసులకు అందుబాటులోకి వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## చైనా మాంజాతో బాలుడికి గాయాలు..

బంట్వారం, జనవరి 15 : చైనా మాంజా తో ఓ బాలుడికి గాయాలైన ఘటన మం డలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు మండల పరిధిలోని బొపు నారం గ్రామానికి చెందిన ఐనెల్లి అనంతయ్య కొడుకు ధనుష్ స్థానిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. పండుగ నేపథ్యంలో ఇంటిదగ్గర గాలిపటం తో ఆడుతున్నాడు. కాగా కాలికి చైనా మాంజా చిక్కుకోవడంతో కాలికి తీవ్ర గాయ మైంది. వెంటనే కుటుంబ సభ్యులు సమీ పంలో కర్ణాటకలోని కుంచావరం ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహించగా, మెరుగైన చికిత్స కోసం తాండూరుకు తరలించినట్లు చెప్పారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ధారూరు, జనవరి 15: ఇటీవల ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఇల్లు దగ్ధం అయిన ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన మున్నూరు అశోక్‌కు మాజీ ఎంపీటీసి మొగిలి శ్వేతా నరోత్తంరెడ్డి బుధవారం రూ ఐదు వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

## వాహనం ఢీకొని సెక్యూరిటీ గార్డు దుర్మరణం

శేరిలింగంపల్లి, జనవరి 15 : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ సెక్యూరిటీ గార్డు మృతిచెందాడు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేష న్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం ...అస్సాం రాష్ట్రానికి చెందిన నారాయణ్ హజరిక(55) నగరానికి వచ్చి కొండాపూర్ శ్రీరాం నగర్ కాలనీలో ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కాగా.. మంగళవారం రాత్రి కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వర్చువల్ సఫారీ ఎదురుగా నడుచుకుంటూ వెళ్తున్న నారాయణ్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని కొండాపూర్ రాఘవేంద్రకాలనీలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అతను మృతిచెందాడు. భార్య రంజన్ హాజరిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తునానరు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client **Mrs Vishlavath Sakkubai** W/o V.Mohan Singh R/o H.No. 3-138/1, LN Colony, Shadnagar, Town, Farooqnagar Mandal, Ranga Reddy dist. This notice is hereby given to the general public that My client is the owner of **Plot No. 25 admeasuring 225 Sq.Yds, in Block No.1, situated at Laxminarasimha Colony, Shadnagar Town, Farooq Nagar Mandal Ranga Reddy dist.** having purchased the same vide Registered Sale Deed bearing document No. 4318 of 2002 dated 16-09-2002 from Mrs MK Vedavathi and my client has lost/misplaced her original link title deed bearing Sale deed no. 457 of 1977 pertaining to the above mentioned property executed in favour of Smt MK Vedavathi executed by Mr M.Narasiah Goud rep by General Power of Attorney holder Mr M.Rangaiah goud

Further it is informed that, any person finding the above mentioned Title deed may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone, any person/(s) having any objections, claims, right, lien, title over the said property may please contact the under signed within 7 days from the date of publication of this notice with relevant documents in support of their claim, As otherwise my client will proceed, treating no claims whatsoever in nature over the said property.

**Sd/- K.Ram Ratan Reddy**
Advocate
Office Address: Plot No.A 4/B,
Ground Floor, Near KFC, Vikrampuri Colony,
Secunderabad-500009